# చిల్లుల కంబళీ

పల్లె కప్పుకున్న చీకటి కంబళీకి అక్కడక్కడ చిల్లులుపడి దివ్వెల వెలుగు కానవస్తూంది. రాత్రి తొమ్మిది గంటలుకూడా అయి వుండదు. కాని ఊరు నిశ్శబ్దమయింది. అక్కడా అక్కడా అరుగుల మీద నలుగురైదుగురు కూర్చుని చుట్టలు కాల్చుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. చుట్టల నిప్పు ఎగరని మిణుగురుల్లా మినుకు మినుకు మంటున్నాయి.

పాకముందు అరుగుమీద కూర్చుని బైరాగి రామస్వామి ఒంటి తీగ సితారు వాయిస్తూ రామదాసు కీర్తన పాడుతున్నాడు. బైరాగి గొంతు భయంకరంగా వుంధి. కాని యిరుగు పొరుగున నిద్రపోతున్న వారు రామదాసు కీర్తనకు అభ్యంతరం చెప్పరు. పల్లెలో రాత్రుళ్ల కుక్కల అరుపుల లాగనే ఈపాట కూడా వారికి అలవాటైంది. మేనల్లుడు సత్యం అప్పుడే అన్నం తిని గర్రున తేపుకుంటూ బయటి కొచ్చాడు.

"ఏం మావా? వొసారాలో సాపేసి లాంతరెట్టమంటావేటి" అంటూ పాట కడ్డు తగిలాడు,

బైరాగి సితారు క్రిందపెట్టి "ఊ, ఎయ్యరా ఎదవా, రోజూ అడగాలేటి? అంటూ కసిరేడు.

"అది కాదు మామా, రెండు రోజులయి పోలీసులు గస్తీ తిరుగుతున్నారోయ్ అని కలట్రాఫీసు బంట్రోతు బసవయ్య చెప్పేడు మామా"

"అది పిగా గొయ్యరి, అదే కలట్టర్లా మాటాడుతాడు. ఒరే సత్తెం! పోలీసుల సంగతి నాకు సెబుతావేట్రా, నాకు తెలీదా? అరు

సార్లు జైలు కెళ్ళినోడిని. అల్లు అలా రూమరు పుట్టిస్తారంతే. అంతే ఒదంతి లేవతీస్తారు. మనుషులు బయపడ్డానికి".

మేనమామ చరిత్ర సత్యానికి తెలుసు. సందర్భం ఉన్నా లేక పోయినా బైరాగి తన జీవితగాధ సగర్వంగా చెబుతూ వుంటాడు. బైరాగికి వ్రాయడం చేతకాదు లేకపోతే తన ఆత్మకథ తప్పక వ్రాసే వాడే.

ఆత్మ విశ్వాసం, గర్వం రాముడికి పుట్టుకతోనే వచ్చాయి. చిన్నప్పటినుంచీ కసరత్తు చేసిన శరీరం యవ్వనం రాగానే బాగా కండలు తిరిగి పందెపు గుర్రంలా నిగనిగ లాడుతూ వుండేది. రోజులన్నీ శరీరాన్ని వృద్ధి చేసికోవడంతోనే గడవడంవల్ల ఎప్పుడూ ఒళ్లు వంచి పనిచేసిన పాపాన పోలేదు. తాను వలచిన పిల్లనే పెళ్ళి చేసుకుంటానని తండ్రితో పోట్లాడి పెళ్ళి చేసుకుని, అత్తవారింట్లో తిష్ట వేశాడు. అత్త మామల పోరువల్ల రోజూ జూదమాడో జేబు కొట్టో నాలుగు డబ్బులుతెచ్చి యింట్లో యివ్వక తప్పేదికాదు. ఒక సారి పట్టుబడి ఆరుమాసాలు జైలుకెళ్ళేడు. జైలునుంచి తిరిగివచ్చే సరికి భార్య ఆడపిల్లని కని చనిపోయింది. పసిపిల్లని అత్తమామల కప్పగించి కూతురు పోషణకోసం తాను దొంగతనాలు చేస్తూ డబ్బు తెచ్చి యిచ్చేవాడు. ఊళ్లు పట్టి, జైళ్ళ కెళుతూ వస్తూ ఓ పదిహేనేళ్ళ పాటు గడిపి యింటికొచ్చే సరికి ముసలి అత్త మామ చనిపోవడంతో కూతురుని తానే చూసుకోవలసి వచ్చింది. కూతురికి యుక్తవయసు రావడం వల్ల దానిని ఒంటరిగా వదలి ఊళ్ళంట తిరగడానికి వీలులేక ఊళ్లోనే పాకేసుకుని స్థిరపడ్డాడు. వయసు మళ్ళి ఒంట్లో ఓపిక సన్నగిల్లింది. గత జీవితం మీద విరక్తి కలిగి పూర్తిగా కొత్తజీవితం ప్రారంభించాలనుకుని సన్యసించి కాషాయ బట్టలు వేశాడు. ఒంటితీగ

పితారు సంపాదించాడు. రాముడు రామస్వామి అయేడు కాని జరుగు బాటెలాగ ? ఇంట్లో చేరిన మేనల్లుడు సోమరిపోతు. దమ్మిడీ సంపాదించి తీసుకురాడు. అందుకే తన పాకలో వీధి వసారాలో చాపేసి, లాంతరు పెట్టి. జూదగాళ్ళను చేర్చి, బాడుగ పుచ్చుకుంటూ వుంటాడు. చాప వెయ్యడం, దీపం పెట్టడం, వీధి గుమ్మంలో పోలీసుల జాడకనిపిస్తే ముందుగా వచ్చి చెప్పడం మేనల్లుడి డ్యూటీ. కబురందగానే బైరాగి దీపమార్పేస్తాడు. ఎక్కడి వాళ్ళక్కడ జారుకుంటారు.

మేనల్లుడికి మేనమామ పోలికే వచ్చింది. మంచి బలమైనశరీరం ఉంగరాలజుట్టూ, అందంగావుంటాడు. కాని మేనమామకంటె తెలివైన వాడు కొద్దిగా చదువుకున్నాడు. అయితే ఒళ్లొంచి పనిచెయ్యడు. అంచేతే బైరాగికి మేనల్లుడంటే కోపం.

బైరాగి కూతురు గవరమ్మ చిలుంగొట్టం, అగ్గిపెట్టె తెచ్చి యిచ్చింది. బైరాగి గొట్టంలో చిలుందట్టించి అగ్గిపుల్ల వెలిగించి "ఏవమ్మా ఇయాల మీ మేనమామ ఉత్తరమేశాడు. తనకొడుక్కి మునసబు కచేరీలో బంట్రోతు పనయిందట" అన్నాడు.

గవరమ్మ సత్యాన్ని చూసి చిరునవ్వు నవ్వింది. గవరమ్మ నవ్వుకి సత్యం ఒళ్లు పులకరించింది. గవరమ్మ చక్కదనం చీకట్లో దీపంలాంటిది. ఎవరికైనా ప్రాణంలేచొస్తుంది. ఆ చిరునవ్వు ఎందుకు విసిరిందో సత్యానికి తెలుసు. ముందుగానే ఆ వుత్తరాన్ని రహస్యంగ చదివించుకుని విన్నాది. మేనమామ గవరమ్మను తనకొడుక్కిచ్చి పెళ్లి చెయ్యమంటాడు. బైరాగికికూడా అదే ఉద్దేశం.

"అయితే ఒక్కటేబిడ్డని నాదికిచ్చి పెళ్లిసేస్తే నేనిక్క డొంటరిగా ఏంచెయ్యాలి ? మకామెత్తేసి నేనుకూడా నీదగ్గరికే వొచ్చే

యాల," అంటూ ఆలోచనలోపడ్డాడు—బైరాగి నిజమే, కూతురినొదలి ఒకక్షణమేనా ఉండలేడు. బైరాగికి కూతురంటే ప్రాణం.

"ఊ, అదే సెయ్యాల. ఇంతమంచి సంబంధం మళ్లీరాదు. ఇక్కడ నుంచి మకాం ఎత్తేసిపోదాం" అన్నాడు బైరాగి ఒక నిశ్చయానికొచ్చి నట్లుగా.

"పోనీలే నాయనా, ఇప్పుడేటి తొందర" అన్నది గవరమ్మ.

"తొందరకాదటమ్మా"

"అయినా అద్ని నాను సేసుకోను నాయనా, అదో కసాయోడు. దయాదాచ్చిన్యాలులేవు".

"బాగుందే నువ్వన్నమాట. అందుకనే అడు నెలకు నూరు రూపాయలు గడిస్తున్నాడు, జీతంకాక పైనకూడా దొరుకుతాదట. దయా దాచ్చిన్యాలంటే ఎవడూ దమ్మిడి గడించలేడే ఎర్రితల్లీ. నాలాంటి బైరాగోడికి వుండాల్సిన గుణమది, గడించాల్సినోడికికాదు. ఏమైనా సరే యీ సంబంధం సెడకూడదు. మాటిచ్చేశాను".

కూతురికివయస్సొచ్చినా బైరాగికి అది చిన్నపిల్లలాగేకవిపిస్తుంది. దానిమాట పట్టించుకోనక్కర్లేదనుకున్నాడు. దాన్ని ఏదో యింత వున్న వాళ్ళింట్లో వడేస్తే అది సుఖపడుతుంది; తానుకూడా యిక గడించక్కర్లేదు. రామా కృష్ణా అంటూ కాలక్షేపం చెయ్యొచ్చును. గవరమ్మతండ్రి మనసు కనిపెట్టి మరి మాట్లాడలేదు

సత్యం బైరాగిని వసారాలోకి పిలిచేడు. వసారాలో చాపమీద పదిమంది కూర్చునివున్నారు. ఒక ప్రక్కగా లాంతరు వెలుగుతూంది. ఒకడు పేకదస్తాకలుపుతున్నాడు. బైరాగివచ్చి ఒకమూల నిల్చున్నాడు.

"ఏం బైరాగయ్యా, దీపమేటి మినుకు మినుకు మంటూంది. కిరసనాయిలు లేదేటి?"

"నేకేం ఇందాకనే పావలా డబ్బులిచ్చి పోయించానే. గాలికలా వుందంతే. వానొస్తాదో ఏటో, వేగం కానీండి" అన్నాడు బైరాగి.

"వానొస్తే మా ఆటకడ్డేటి? మాకు మరీ మంచిది. పోలీసోళ్ళ బెడదుండదు."

"సరే, ఆ భగవంతుడు శ్రీరామ చంద్రమూర్తిని తలుసుకుని ఆట మొదలెట్టండ్రా, ఆటగెలిసి తీరుతారు. అయితే, ఏ ఆట కాఆట అవగానే గెలిసినోడు రూపాయికి అణాలు బాడుగ నాకిచ్చేయాల్సిందే. అల్లే యిస్తారుగదా అని పోయి పడుకుంటే నిన్న నాకు రూపాయి నష్టమయింది" అన్నాడు బైరాగి.

"పాపం నష్టమయిందా? బైరాగయ్యా నీ నోటంట ఎప్పుడైనా నిజంపలికితే యినాలనుందయ్యా. ఆట మంచిపట్టుగోవుంటే పోలీసులని గావుకేకపెట్టి దీపమార్పేశావు. గందరగోళంలో నాలుగురూపాయలు డబ్బులు నొల్లుకున్నావు. ఇలా చాలసార్లు చేశావులే"

"ఛ, ఛ, అమ్మతోడు అలాంటి దగుల్బాజీ పని నానెప్పుడూ సెయ్యనోరే. చీకట్లో ఎవడు కొట్టేశాడో అయినా బైరాగోడ్ని నాకు డబ్బులెందుకొరే"

"అవును నాయనా, అవును, ఈ సంగతి చెప్పాలేటి? పోనీ, అందుకనే అసలు నువ్వు ఆటకాడ వుండక. కావాలంటే నీ మేనల్లుడి నుంచు. నువ్వు పోయి సితారు వాయించుకో"

"సరేలే నాయముంటే ఎవరూ వుండక్కరలేదు. బాడుగ డబ్బులు వేరే తీసి పడేయండి అంతే"

"న్యాయంగా నీ బాదుగ నువ్వుచ్చుకో కాదనం. కాని మధ్యలో ఉత్తినే పోలీసులంటూ కేకపెట్టి దీపమార్పడం, డబ్బులు నొల్లుకోడం యిలాంటి దొంగేషాలు ఏశావంటే యీసారి తన్నులు తింటావయ్యా బైరాగీ యిప్పుడే చెబుతున్నా" అంటూ ఒకజూదగాడు వార్నింగిచ్చాడు

ఆట మొదలైంది. ఆట చూస్తూ కూర్చున్నాడు బైరాగి.

వీధిలో సత్యం, గవరమ్మ మాట్లాడు కుంటున్నారు. "ఓప్ బెంగెట్టుకుంటావేటే పిచ్చిదానా. మూడో నాటికల్లా మీ నాయన కోపం అదే సల్లారిపోతాది. మళ్ళీ యిక్కడికే రావచ్చు మారువాడీకి నామీద గొప్ప గురి. ఎప్పుడొచ్చినా నౌఖరీ యిస్తానన్నాడు. నెలకు రెండొంద లొస్తాయి. మారాజులా బతకొచ్చు" అంటున్నాడు సత్యం.

బయట కూతురూ మేనల్లుడూ ఏదో మాట్లాడుకుంటున్నారని కనిపెట్టి బైరాగి వీధిలో కొచ్చి మేనల్లుణ్ని వసారాలోకి పంపించాడు. కూతుర్ని లోపనికిపోయి పడుకోమన్నాడు. తాను వీధిలో అరుగు మీద కూర్చుని చిలుం గొట్టం ముట్టించాడు.

బైరాగి కూతురు పెళ్లి గురించే అలోచిస్తున్నాడు. ఈ పెళ్లి కోసం తాను అయిదు వందలు కూడ బెట్టాడు. నగా నాణ్యం చేయించ డానికో రెండు వందలు వేరే వుంచాడు. దాని పెళ్లి వైభవంగా చెయ్యాలి. బైరాగాడు కూతురికి పెళ్లేం చేస్తాడని నలుగురు అనడం తనకి తెలుసు. ఈ పెళ్లి చూసి "బైరాగాడు అసాధ్యుడోయ్" అని అంతా ఆశ్చర్యపోవాలి. ఎవడూ ఏ లోపమూ వేలెత్తి చూపించ కుండా చేస్తాడు.

బైరాగి చిలుంగొట్టం ప్రక్కన పెట్టి అక్కడే నడుం వాల్చేడు. చిన్న మగత నిద్రలో అల్లుడు తన్నెంతో మర్యాద చేసినట్టూ, తను కూడా కూతురి దగ్గరే వున్నట్టూ కలొచ్చింది.

ఎంత రాత్రయిందో తెలీదు. లోపల వసారాలో అంతా గొల్లు మంటూ లేచారు, బైరాగి త్రుళ్ళిపడి లేచి కూర్చున్నాడు. వసారాలో దీపం లేదు. ఎవరి దారినవారు పోతున్నారు.

"ఏటయిందయ్యా" అన్నాడు. బైరాగి కళ్ళు నులుపుకుంటూ,

"నిజంగానే పోలీసుల ఈల యినిపించింది మరి· ప్రక్క వీధుల్లో వున్నారేమో తెలీదు·" అంటూ గబగబ వరిగెత్తేడొక జూద గాడు.

బైరాగి చిలుంగొట్టం తీసుకుని లోవలికెళ్ళేడు. లోపలంతా చీకటిగా వుంది. అగ్గిపెట్టె తీసి లాంతరు వెలిగించాడు. చాప మీద ఒక పైసా కూడా లేదు. "ఏంటా సత్తెం, డబ్బులేవి" అంటూ కేక పెట్టేడు. లాంతరు వొత్తి పెద్దది చేసి లోవలికెళ్ళేడు. సత్యం. ఎక్కడా లేడు. "ఈ దొంగ వెధవ దీపమార్పేసి డబ్బులు పట్టుకు పోయినట్టున్నాడు," అనుకుంటూ" తల్లీ గవరమ్మా" అని పిలిచాడు కూతుర్ని· కూతురు కనపడ లేదు.

గవరమ్మ తన్ను వదిలి పెట్టి పోయిందా? బైరాగికి మతి పోయింది. కుప్పలా నేలకూలబడ్డాడు, చీకటి వెలుగులకు గంత కట్టి దాగుడు మూతలు ఆడిస్తూవచ్చిన బైరాగి కళ్ళు బయర్లు కమ్మేయి ఆ లాంతరు ఎక్కడుందో కాని తాను యీచీకటి గుయ్యారం నుండి బయట పడేటట్లు లేదు.

ఇప్పుడు నిజంగానే జీవితంచేదనిపించింది.